రచన: సంక్రాంతి ప్రత్యేక సంచిక : జనవరి 2004

# మనం ఎంతైనా భారతీయులమేమో!

"నీ కన్నవాళ్ళ సహకారం లేకుండా నీ బ్రతుకు వెళ్ళడం జరగని పనే. పెద్దవాళ్ళని కాదని పెళ్ళిచేసుకోవడం గొప్పకాదు. వాళ్ళను కాదని జీవితాంతం మనుగడ సాగించడమే గొప్ప. ఇది ఆడపిల్లల విషయంలో జరగదు. అయినా అతనూ నువ్వూ చదివింది, ఎంత? మీ చదువుల వల్ల రాబడి ఇండియాలో బొటాబొటీగా వస్తుంది. అమెరికాలో అయితే చెప్పనే అఖ్ఖర లేదు. ప్రస్తుతం మిమ్మల్నక్కడ ఎవరూ దగ్గరకు రానివ్వరు. ఇక ప్రేమ తగ్గిన తర్వాత దాని ఉధృతం ఆగిన తర్వాత మన పొరపాట్లు ఏమిటో మనకు తెలిసొస్తాయి. అప్పుడు నాలిక కరుచుకుని లాభం వుండదు. మీ విషయంలో అలా జరగకూడదనే నా బాధ అంతా!

"ఇక అమెరికాలో చదువుకుంటూన్న నీ చెల్లెలు సుకుమారి గురించి నువ్వు మర్చిపోతే ఎలా? అది నీ తప్పు అవదా? అది నాలుగేళ్ళుగా అక్కడ వుండి చదువుకుంటోంది. షడెన్‌గా దాని భవిష్యత్‌కు నువ్వు ప్రతిబంధకమయితే ఎలా? దాని పరిస్థితి ఏమిటో ఆలోచించావా?

"ఇక గిరి గురించి నేను ఎక్కువగా మాట్లాడకూడదేమో? అతనూ పెద్ద ఆస్తిపరుడు కాదు. ప్రస్తుతం చదివిందీ తక్కువే! ఇక – వాళ్ళ వాళ్ళు మీరు చెప్పకుండా పెళ్ళి చేసుకుంటే మిమ్మల్ని ఎందుకు ఆదరిస్తారు? అయినా అటు మీ ఇంట్లోనూ, వాళ్ళింట్లోనూ చెప్పకుండా మీరెందుకు పెళ్ళిచేసుకోవాలే...."

రాధ ఆ ప్రశ్నలకు జవాబివ్వలేదు. అయితే ఇందుమతి ఓసారి రాధను చూసి ఏదో గుర్తుకు వచ్చినట్టు తిరిగి అంది.

"పైగా మీరు మీ కులాలను ధిక్కరించి కదూ పెళ్ళిచేసుకొనేది? కులాంతర వివాహం అన్నమాట. సారీ – నాకు నీ అంత అమాయకురాలు మన స్నేహితుల్లో ఎవరూ కన్పించలేదే? నిజం? ఈ దేశంలో డబ్బులు పోయందే ఇప్పటికీ పెళ్ళిళ్ళు జరగడంలేదే! ఆ విషయం నీకు తెలియదా? కట్నం తగ్గిన సూచనలు కానీ, కట్నం అంటే మొహం తిప్పుకునే వాళ్ళుగానీ ఒక్కటంటే ఒక్క శాతం తగ్గలేదే? కట్నం లేకుండా అత్తవారింటికి వెళ్ళిన నీ విలువ ఎంతటిదో నీకు పెళ్ళి అయిన తర్వాతే తెలుస్తుంది.

"ఇక మాట వరసకు మీకుగానీ అమ్మాయి పుట్టిందనుకో? ఆ అమ్మాయికి మీరు ఎంత కట్నం యివ్వాలో, యివ్వవల్సివస్తుందో నీకు తెలుసా? నీదో కులం, మీ ఆయనదో కులం అయినప్పుడు మీ అమ్మాయికి కట్నం రేటు పెరుగుతుందో, తరుగుతుందో నువ్వే చెప్పాలి. మన ఇండియాలో కట్నాల రేటు, అలాగే కులాలూ, గోత్రాలు వాటి హెచ్చుతగ్గులు వీటి గురించి నీకు తెలియదా? ఇది కులాల అంతరంతో పుట్టేవాళ్ళను పీడించకుండా వదిలి పెడుతుందనుకున్నావా?

రోజు రోజుకు ఇరుకు అయిపోతోందే మన దేశం. డబ్బు – డబ్బు కాక పోతే కులం, కులం కాకపోతే హోదా – ప్రతీదీ మధ్యతరగతి వాళ్ళకు ప్రతిబంధకం అయ్యిందే! నువ్వేం చేస్తావే రాధా అప్పుడు? పోనీ మీ ఆయన – ఆ గిరిగారు ఏం చేస్తారే? వీటికి సరియైన సమాధానం చెప్పు?.... సంతోషంగా నీ పెళ్ళికి వస్తాను. అక్షింతలు వేస్తాను... లేకపోతే పట్టిట్టినే నిన్ను దీవించడం నా వల్ల కాదు. నిజమా కాదా? నే అడిగింది....." అంది స్నేహితురాలు ఇందుమతి.

"నువ్వు నాకు ధైర్యం అందిస్తావనుకున్నాను ఇందుమతీ. ఎంతో నమ్మకంగా నీ దగ్గరకు వచ్చాను. కానీ నువ్వు నన్ను భయపెడుతున్నావు. బహుశా...." ఆగిపోయింది రాధ – ఆమెకు ఎందుకో మాటలు రాలేదు.

"రేపటి బాధ.... రేపటి కన్నీళ్ళు ఎలా వుంటాయో నీకు గుర్తుచేయడం సహజంగా నీ ప్రాణస్నేహితురాలైన ఈ ఇందుమతి బాధ్యత అన్పించిందే."

"అయితే నన్నేం చేయమంటావ్?"

"నే చెప్పినట్టు చేస్తావా?"

తల నెమ్మదిగా ఊపింది.

"నిజం – మాట తప్పకూడదు...." ఇందుమతి, రాధ చుబుకాన్ని తన చేతిలోకి తీసుకుంది.

మళ్ళీ తల ఊపింది రాధ.

అప్పుడు స్నేహితురాలు ఇందుమతి తనకు తోచింది, తనకు మంచి అన్పించింది నెమ్మదిగా చెప్పసాగింది....

"అలా అంటావా – అయితే" అని ఒకటికి రెండుసార్లు అంది రాధ!

❖ ❖ ❖

" – నీకు తెలియకుండా మీ అక్క – గిరి అనే అతనితో చాలా క్లోజ్‌గా వుంటోంది. వాళ్ళని చూసిన వాళ్ళు, వాళ్ళిద్దరూ ప్రేమికులే అనుకుంటారు. నిజం. ఇండియాలో పెద్దవాళ్ళు ఇటువంటివాటిని సహించరని – తను ఫార్వర్డ్‌స్టెప్‌లు అక్కడ వుడకవనీ ఈ అమెరికా వచ్చేసి వుంటారు. అదే – ఆ రాధా – ఆ గిరినూ..... వాళ్ళిద్దరూ ఇక్కడకు వచ్చి ఏడాది పూర్తికాలేదు. అతనుండేది శాన్‌ఫ్రాన్సిస్‌కో. ఆమె వుండేది – డెట్రాయిట్‌లో. దూరాన వున్నా ప్రేమ మొలవవచ్చుగానీ, ఇంత, ముదర పాకాన పడ్డం కష్టం. ఖచ్చితంగా ఈ ప్రేమకు బీజాలు ఇండియాలోనే పడి వుండాలి. నేను విన్నది నిజమే అయితే – అతను చదువు అయిపోగానే ఈ అమెరికా వదిలేటట్టు లేడు. సో – మీ అక్కా వదలదు. సో!! అయితే ఈ వారి ప్రేమలో ఓ తిరకాసు వుంది. అదేమిటో తెలిస్తే బహుశా నీ గుండె మరింత వేగంగానైనా కొట్టుకోవచ్చు.... లేకపోతే వేగం చాలా తగ్గి ఏమైనా కావొచ్చు. అయినా చెప్పక తప్పడం లేదు. అతగాడు మీ వాడు కాదు. ఖచ్చితంగా కమ్మవాడు. మీరు ఆ కులం వాళ్ళు కాదని మాత్రం నాకు ఖచ్చితంగా తెలుసు. ఇది ఇక్కడితోపోతే మంచిదే... కాని పోదు. మీ ఇంటిని కిందా మీదా చేస్తుంది. నీ అక్క తన కులం వాడిని కాకుండా వేరే కులం వాడిని ప్రేమించి పెళ్ళాడినప్పుడు – నీ పెళ్ళికి వుండే చాన్సెస్ నెమ్మది నెమ్మదిగా తగ్గిపోతాయి. 'వీళ్ళ అన్న ఏం చేసాడు', 'వీళ్ళ అక్క ఏం చేసింది' మొదలయినవి ఆరాలు తీయడంలో మనవాళ్ళు ఘటికులు. 1802లో జరిగిన కులాంతర వివాహాలు, ప్రేమ వివాహాల గురించి మనవాళ్ళు చెప్పగలరు. కానీ – అదే నోటితో – స్వకులంలో జరిగిన అన్యాయాల గురించి మాత్రం మర్చిపోయినట్టు నటిస్తారు. ఇక నీ విషయానికి వస్తే 'వీళ్ళ అక్క ఫలానా పని చేసింది కాబట్టి, నువ్వు పెళ్ళి అయిన తర్వాత ఏవేవో చేస్తా'వని వీళ్ళు తెగ వూహించి గాలిమేడలు కట్టేస్తారు. నిజం – ఒట్టు. కావాలంటే మీ అమ్మగార్నీ, నాన్నగార్నీ అడుగు..... వాళ్ళకు తెలిసిందంటే గుండె పగిలిచస్తారు. లేకపోతే రాధ పీక అయినా పిసుకుతారు. నువ్వేమిటి అన్నీ విని కూడా నిమ్మకు నీరెత్తినట్టున్నావ్? అరే ఫూల్‌లా – నవ్వుతున్నావ్ కూడా..... నీకు నవ్వెలా వస్తోంది – సుకుమారీ, ఆపు.... బాగా ఆలోచించు సుకుమారీ" రాఘవ అన్నాడు.

అంతవరకూ వేల మైళ్ళ దూరంలో ఇండియాలో తన ఆత్మను వుంచినందుకు - తిరిగి దాన్ని అమెరికా తీసుకురావడంలో అతనికి కష్టమే అన్పించింది. కొంచెం అటూ ఇటూ వూగి ఏవేవో విన్యాసాలు చేసాడు.

"ఈ రోజుల్లో కూడా పద్దెనిమిదో శతాబ్దపు ఆడపిల్లలా ఏడవ మంటావా రాఘవా? లేకపోతే మా అక్కకు మెసేజ్ ఇచ్చి, 'నా బ్రతుకు మాట మర్చిపోయావా' అని దెబ్బలాడమంటావా? ఇలాంటివి ఎవరికి వాళ్ళకు తోచాలి. లేకపోతే మీలాంటి మధ్యవర్తులు కలగ జేసుకోవాలి. అంతేగానీ నేనేం చేయగలను - ఏం చేస్తే బావుంటుంది! పైగా నేను ఇంట్లో చిన్నదాన్ని....."

ఆమె చుట్టూ కూర్చున్న రాఘవ, యితర మిత్రులు సుకుమారి మాటలతో మొహామొహాలు చూసుకున్నారు. తర్వాత జుట్టు పీక్కుంటే బాధ కల్గిన మొహాలు ఎలా వుంటాయో అలా మొహాలు పెట్టారు.

"మీ అమ్మగార్కీ, నాన్నగార్కీ వ్రాయమని మా వుద్దేశం"

"వాళ్ళు అంత దూరం నుంచి బోల్డు డబ్బు ఖర్చుచేసుకుని - ఆపైన కొన్ని గంటలసేపు మనసు ఉగ్గబెట్టుకోగలరా" అంది.

"అలా అంటే ఎలా సుకుమారీ.... వూరు కోవడం ఇప్పుడు బాగానే ఉండచ్చు. కానీ రేపు బాగుండదు. ఆ తర్వాతేమో - అదే - నువ్వు జుట్టు పీక్కోవల్సి వస్తుంది. అవతల ఎల్లుండేమో ...." ఓ స్నేహితుడు మాటల మధ్యలో ఆపేశాడు.

"మీ ఉద్దేశ్యం ఏమిటండీ రాఘవరావుగారూ - నేను అమ్మకి ఫోన్‌చేసి ఏం మాట్లాడాలి? నా పెళ్ళికి ముప్పు ఏర్పడుతుందని ఆమెను భయపెట్టాలా? నిజానికి మా అక్క కులం దాటి ఎవరితోనో పెళ్ళాడితే ఇక్కడి నా పెళ్ళి ఆగిపోవడం ఏమిటి? అసలు ఈ ప్రపంచంలో నన్నెవరూ పెళ్ళాడరనేగా మీరు చెప్పబోయేదీ - మీ భయమూనూ? ఒకవేళ అలా జరిగితే నేనేం చేస్తాననేగా మీ ప్రశ్న?" సూటిగా అడిగింది, సుకుమారి.

"అహా.... మాకు తోచింది చెప్పాం.... మీరు ఈవేళ కాకపోయినా రేపైనా అమెరికా వదిలి వెళ్ళాల్సిందే! ఇక్కడి వాతావరణానికీ, మన వాతావరణానికీ వుండే తేడా మర్చిపోవద్దనేదే మా వుద్దేశ్యం. అయినా ఆమెకు మనవాళ్ళలో ఎవరూ దొరకరంటారా?"

"థ్యాంక్స్" అంది అలాంటి మాటలకు అమెరికాలో పెద్దచోటు వుందని - వుంటుందని పరోక్షంగా గుర్తుచేస్తోన్నట్టుగా.

రాఘవ, అతని పక్కన వున్న స్నేహితులు అప్పటికి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఆ ముగ్గురూ మొహామొహాలు చూసుకున్నారు. రాఘవ ఫోన్ చేతిలోకి తీసుకుని తిప్పి గబగబా అనేశాడు. "క్షమించండి - ఇలా చెప్పవల్సివస్తోన్నందుకు? నా పేరు రాఘవ. మీ పెద్దమ్మాయి రాధ అదే - డెట్రాయిట్‌లో వుంటుంది కదూ" అన్నాడు. ముందు - ముందు మాటగా!

లలిత "ఏమిటీ" అంది. ఆ తరువాత నెమ్మదిగా "అవును" అంది.

"ఆమేమో" అంటూ రాఘవ తన చిట్టా నెమ్మదిగా తెరిచాడు. అంతా చెప్పాడు.

"ఎవరు? రాధా.... ఇలా చేసిందా? నిజమేనా?" అంది ఏడుపు కంఠంతో లలిత.

"మేం ఎందుకు అబద్ధం చెబుతామండీ.... అయినా మీరిప్పుడు ఆలోచించవల్సింది - ఈ రాఘవ గురించి కాదు. మీవాళ్ళ గురించి. ఎందుకంటే -" రాఘవ కూడికలూ, తీసివేతలూ జమ చేసి ఓ అరగంట మాట్లాడాడు.

ఆ అరగంటలో లలిత గొంతులో మార్పులు వచ్చాయి. అది ఏడుపును తారాస్థాయికి తీసుకు వెళ్ళింది. ఆ తరువాత ఆమె ఫోన్‌లో తను ఏడుస్తున్నాననీ, ఎక్కుతున్నాననీ కూడా మర్చిపోయింది!

"మీరు ఇటు - డెట్రాయిట్ వస్తే మంచి దేమో" అన్నాడు రాఘవ.

"అలానే వస్తాను"

"శాస్త్రిగారు ఒప్పుకుంటారాండీ, మిమ్మల్ని ఒక్కళ్ళనీ పంపడానికి"

"ఆయన ఇష్టం ఏం లేదు. ఆయన మాట నేను వినేది లేదు - అసలు. ఆడపిల్లలకు చిన్నప్పటినుంచి ఈ గారాలూ, ఈ అమెరికా ప్రయాణాలూ తల కెక్కించింది ఆయనే. ఆయన వల్లే ఇదంతా జరిగింది. ఆయన్ను ఇంటికి రానివ్వండి - చెప్తాను" - లలిత ఫోన్‌లో వళ్ళు మరిచి భర్త శాస్త్రిగారినీ, కూతురు రాధనీ తిట్టడం మొదలు పెట్టింది!

హిస్టీరియా తగ్గు మొహం పట్టిన తర్వాత- "సుకుమారీ నే విన్నది నిజమేనా" అంది - అమెరికా ఫోన్ చేసి.

"ఏమిటే అమ్మా" అంది సుకుమారి.

"అంటే నీకు తెలియదన్నమాట. అంతేకదా" అపనమ్మకంగా అంది లలితమ్మ.

"సరిగ్గా చెప్పమ్మా" అంది సుకుమారి.

"సరిగ్గా చెప్పడం అంటే ఏమిటే? నేను విన్నది నిజమేనా అని అడుగుతున్నాను. ఆ అబ్బాయి రాఘవ చెప్పింది సత్యమేనా అని అడుగుతున్నాను"

రాధ నెమ్మదిగా అనేసింది, "నేను ఇండియా వచ్చి నీతో అన్ని విషయాలూ మాట్లాడతానే..... ఫోన్‌లో ఎంతని చెప్పేది.... అవును - ముందు నువ్వు ఏడుపు ఆపకపోతే ఎలా అమ్మా? ఏడుపు మానెయ్యి అమ్మా...."అంది, ఆ ఏడుపు ఎక్కడికో తీసుకువెడుతూంటే, తట్టుకోలేక.

"అమెరికా వెళ్ళావో లేదో ఇంత తెలివితేటలు ఎలా వచ్చాయే. నేను ఏమైనా సరే, అమెరికా, అదే డెట్రాయిట్ వస్తాను"

"ప్లీజ్ వద్దమ్మా - నువ్వు యింత దూరం రానవసరం లేదు. నేనే వస్తాను. నాకు శెలవలు కూడా"

"ఏమోనే మీ ఇష్టం.... మీ ఇష్టం వచ్చినట్టు ఏడవండి. ఇదిగో.... నాన్నగారు ప్రస్తుతం ఇంట్లో లేరు.... ఓ గంట తర్వాతో, రాత్రో ఫోన్ తగలడండి. అవునూ ఆ పెద్దది రాధ గదిలో

లేదా? అది మాట్లాడదేం?" అంటూ గబగబా అడిగింది....

"ఇంట్లో లేదు.... గంట క్రితమే కాలేజీకి వెళ్ళింది"

"కాలేజీకే వెళ్ళిందా? ప్రేమించిన అతనితో తిరగడానికి వెళ్లిందా....?" అంది ఏడుస్తూనే.

"ఊరుకో అమ్మా.... ఏడవకు..."

"నోర్ముయ్.... దూరంగా పంపద్దంటే ఆయన వినలేదు. నిన్ను పంపారు. దాన్నీ పంపారు. అది ఎవడినో ప్రేమించింది కదా – వూరుకున్నావ్ – దేనికి నువ్వూ ప్రేమించు" – సుకుమారి ఖిన్నురాల యింది. అయినా ఫోన్ వినక తప్పలేదు – సుకుమారికి.

❖ ❖ ❖

"ఇదేమిటే అక్కా – ఇలా చేశావ్, నువ్వు?"

"ఏం చేశానే" అంది పనిచేసుకుంటున్నది వెనక్కి తిరిగి రాధ.

"అమ్మో.... నువ్వు నంగనాచివే....ఏమో అనుకున్నాను. నాన్న అప్పుడప్పుడనేది – నిజమే.... పెద్దత్తయ్య పోలికలు నీకు వచ్చాయి. నిజమే"

"వాళ్ళ సంగతి వీళ్ళ సంగతి ఎందుకే.... అసలు విషయం చెప్పు"

"నీ పెళ్ళి నీ ఇష్టమే. ఎవరు కాదనరు. అయితే పెళ్ళి చేసుకునే ముందు, అందునా కులం కాని కులం వాడిని చేసుకునే ముందు, నువ్వు ఎన్ని ఆలోచించాలో నీకు తెలియదా? ముఖ్యంగా నా గురించి ఎందుకు ఆలోచించలేదే అక్కా?" ఎంతో సౌమ్యంగా అడిగింది, సుకుమారి.

ఎదురుగా నుంచున్న రాధ మొహం ముందు తెల్లగా, ఆపైన ఎరుపుగా మారింది. అయినా తేరుకుని చిన్నగా నవ్వింది.

"నాకెలా తెలిసిందని నువ్వు కొట్టిపారెయ్యి లేదంటేనే, నా మాటలు వెంటనే కాంట్రడిక్ట్ చేయడంలేదంటేనే నిజం తెలుస్తోంది"

"ఇప్పటికి నువ్వు అమెరికా సాయిల్‌లో ఎదిగి అటూ ఇటూగా ఐదేళ్ళు అవుతోంది కదూ"

"ఆ విషయం ఎందుకు ఇప్పుడు?"

"నీ మాటలు వింటే నువ్వు ఇంకా ఇండియా అమ్మాయిలాగే మాట్లాడుతున్నావనిపించింది. అందుకని అడిగాను. నేను ఇటు వచ్చి అటూ ఇటూగా ఏడాది అయ్యింది. నేను కులం కాని వాడిని ప్రేమిస్తే నీకు బాధేమిటే? నిన్ను ప్రేమించమంటే నువ్వు యేడ్వాలి. అంతేగాని నా గురించి యేడుస్తావేమిటి? నువ్వూ నేనూ చెరో చోటా వుంటున్నాం. అంతగా అయితే నేను అక్కనని చెప్పుకోకు? అలాగే నా పెళ్ళికి రాకు"

"అంతేగానీ ఆ చౌదరిని వదలనంటావ్?"

"వదిలి, ఏం చెయ్యాలి.... అయినా అతన్ని ఎందుకు వదలాలే?"

"అమ్మ ఎంత ఏడుస్తోందో నీకు తెలుసా?"

"నాకు తెలుసు. అమ్మ నీకు ఫోన్ చేసింది. ఏడ్చింది. ఆ దెబ్బతో నవ్వు లేని పెద్దరికం తెచ్చుకుని నాకు సలహాలు యివ్వడం మొదలు పెట్టావ్. అంతే కదా?"

"అమ్మ గురించి తేలిగ్గా మాట్లాడుతున్నావ్. రేపు నీ కూతురు ఏ సౌత్ ఆఫ్రికాలోనో వుండి ఈ పని చేస్తే అప్పుడు తెలిసొస్తుంది – బాధ ఎలా వుంటుందో?...."

"నాకు తెలుసే సుకుమారీ.... యివన్నీ నీకు అమ్మ చెప్పింది.... నువ్వు నా దగ్గర వాటిని అప్పగిస్తున్నావ్"

"అయితే నువ్వు ఆ చౌదరిగారిని ప్రేమించడం అబద్ధం కాదా... నిజమేనా?" సంశయంగా అడిగింది సుకుమారి.

"ఇదేమిటే నీ దగ్గర ఎందుకు అబద్ధం చెబుతానే... ఏమిటి అసలు నీ వుద్దేశం? మా పెళ్ళి ఇండియాలోనే అవ్వాలి. మన ఆర్థిక స్థితి, వాళ్ళ ఆర్థిక స్థితి, ఇండియాలో మన వాళ్ళ యిళ్ళ పరిస్థితులూ – యివన్నీ ఆలోచించి స్నేహితులు సలహా యిస్తే ఈ అమెరికా రావల్సి వచ్చింది. మేం ఆర్థికంగా నిలబడేదాకా పెళ్ళి చేసుకోం. ఈ మాట మా హృదయాల్లోంచి వచ్చింది. ఎవరెన్ని అనసీ – అనుకోనీ తప్పదు.... హృదయం వుంటే మంచితనం వుంటే నువ్వూ అర్థం చేసుకో. లేదా – నీ ఇష్టం"

"అమ్మ ఏడ్చినా ఫరవాలేదా?"

"అమ్మ ఏడుస్తుంది. మామూలుగా కాదు. భోరున యేడుస్తుంది. నాకు తెలుసు.... కానీ మా మధ్య ప్రేమ...." – రాధకు ఎందుకో కన్నీరు ఆగింది కాదు. చటుక్కున యేడ్చేసింది.

"ఏం చెయ్యమంటావ్..... నీ భవిష్యత్ పాడవుతుందేమో... కానీ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా... నా మూలంగా నీ జీవితం పాడుచెయ్యవద్దని....." అంది చటుక్కున.

సుకుమారి క్షణం తల వంచుకుంది. ఆమెకు ఆ క్షణంలో అక్కగా రాధ వేల మైళ్ళ దూరంలో వున్న తల్లి కన్నా గొప్పగా – తల్లితో సమానంగా కనబడింది. ఎందుకో అప్పుడు ఆ ఆలోచన రాకూడదు. నిజమే!! కానీ పరిస్థితులు తీసుకువస్తాయేమో – అటువంటి వాటిని!!

"వద్దు అక్కా.... నువ్వు ఏడవవల్సిన పని లేదు. వాటిని ఆపెయ్యి. ప్లీజ్" ఎంతో బాధగా, మరెంతో అనునయంగా అంది సుకుమారి. ఆమె కళ్ళవెంబడి కూడా కన్నీరు కారసాగింది...

"నువ్వెందుకు ఏడుస్తున్నావే? ..... అదేమిటీ?" అంది రాధ – తన కన్నీళ్ళు తడుచుకుంటూ.

"మొదట నేను స్నేహితులు చెబితే నమ్మ లేదు. నువ్వూ చెపితే కూడా అబద్ధమే అనుకున్నాను. ఎందుకో తెలుసా. బహుశా నా మనసులో గిల్టీ కాన్షస్‌నెస్ కాస్తంత వుండడం మూలంగానేమో?" – సుకుమారి కంఠం మారింది. మాటలాడుతుంటే ఎందుకో మాటలు తడబడ్డాయి. కంఠమూ మారింది.

"అదేమిటి. మధ్యన నువ్వు ఏడుస్తున్నావ్ దేనికి? నువ్వు ఇండియా కబుర్లు మానేసి అమెరికా అమ్మాయిలా మాట్లాడవే సుకుమారీ. అప్పుడు ఏడుపు రాదు"

సుకుమారి కళ్ళు తుడుచుకుని, "నువ్వు నాకు ధైర్యం యిచ్చావు. అందుకే పరోక్షంగా చెబుతున్నాను. విను. నేను ఓ రెడ్ల అబ్బాయిని ప్రేమించానే ఇక్కడ. ఈ ప్రేమ నాలుగేళ్ళుగా సాగుతోంది. అతను బాగా చదువుకున్నాడు. బాగా ఎర్న్ చేస్తున్నాడు. పైగా అతని వాళ్ళూ, మన వాళ్ళూ కూడా దూరంగా వున్నారు. ఇప్పట్లో ఇండియా వెళ్ళం - మేం. మా ఇద్దర్నీ బహుశా ఈ ధైర్యమే ఇంతదూరం తీసుకు వెళ్ళిందను కుంటాను. కానీ అమ్మ ఏడుపు చూసిన తరువాత - ఆ కన్నీటి శబ్దం ఫోన్‌లో విన్న తరువాత నాకు అదోలా అన్పించిందే.... ఎందుకో తెలియదు .... అందుకే..." - మాటలు ఆపేసింది సుకుమారి.

"ఈ విషయం నాతో ఈ యేడాదిలో ఎప్పుడూ చెప్పాలనిపించలేదా నీకు? ఆశ్చర్యంగా వుంది" - అదోలా అంది రాధ.

"సారీ అక్కా - నాకు కొద్దిగా భయం వేసింది. అది మొదటి కారణం. యిక ఈ విషయం తెలిస్తే - అదే మనిద్దరం కూడా ఇంటర్ కాస్ట్ అబ్బాయిల్ని సెలక్ట్ చేసుకున్నామని తెలిస్తే - అమ్మ ఇంకా హోరున ఏడుస్తుందేమోనే..... ఆ ఏడుపులో ఆమె గుండెగానీ ఆగిపోతుందేమో.... మొన్న నీ గురించి అమ్మ ఏడ్చినప్పుడే నాకు ఏడుపులో యింత బాధా, బలం వుంటాయని అర్థమయ్యింది! నేను పొరబాటు చేశానేమో అన్పించింది. నా గురించి ఎలా చెప్పాలే" అంది. అప్పటికే సుకుమారి రెండు కళ్ళూ చమర్చాయి.

రాధ, చెల్లెలు సుకుమారి వైపు చూసింది. ఎంత వద్దనుకున్నా కన్నీరు ఆమె కళ్ళను కూడా కదిపి కుదిపాయి! అందుకే తల్లి గురించి ఆలోచించింది. ఆ కన్నీరు దాంతో ఇంకా ఎక్కువయ్యింది. అలాగే చెల్లెలు సుకుమారి వైపు చూసింది... కాసేపు తల వంచుకుంది.

సుకుమారి అక్క వైపు చూసింది. నెమ్మదిగా అంది.

"బహుశా ఇది భారతదేశపు కన్నీరు అయివుంటుంది. ఎక్కడో వున్న అమ్మనే కాదు - ప్రేమలో పడ్డా, ప్రేమించినవాడు దగ్గరగా వున్నా, మనల్ని చుట్టుముట్టింది. ఇది అమ్మదయినా, నాన్నదయినా, నాదయినా, నీదయినా ఈ కన్నీటికి విలువ అనేది వుంటుందేమో: నువ్వూ, నేనూ కంగారుపడ్డా, అమ్మా, నాన్నా ఆవేశపడ్డా - ఇది మనుష్యుల్ని దూరం చెయ్యదేమో! మనుష్యుల్ని విడగొట్టదేమో!! అయినా తప్పదు. నేను ముందు నాన్నతో చెప్తాను. ఆ తరువాతే అమ్మతో చెప్తాను. సరేనా.... నువ్వు కంగారుపడకు"

"ఒకవేళ అమ్మ చచ్చిపోతానంటే."

"మన గురించి అమ్మ బ్రతికే వుంటుంది. కానైతే తిడుతుంది, కానైతే ఏడుస్తుంది. ఇద్దర్నీ నరికి పోగులు పెడతానంటుంది - కానీ..... కానీ ఏం చేయదే! అమ్మకి మనం, మనం అమ్మకీ కావాలి. తప్పదు.... ఈ భారతదేశం బంధం అంతే!"

❖